హైదరాబాద్ వార్త

# ఉదయం 5.30 గంటల నుంచే మెట్రో సేవలు

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త :** నగరంలో మెట్రో రైళ్ల రాకపోకలు ఉదయం 5.30గంటల నుంచే మొదలవుతాయని మెట్రో అధికారులు తెలిపారు. మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దానికి తోడు ప్రస్తుతం ఉన్న సమయాలను పొడిగించాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మెట్రో రైళ్ల వేళలను పొడిగించాలని మెట్రో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా సోమవారం నుంచి శుక్రవారం ఐటీ ఉద్యోగులు మెట్రో రైళ్లలోనే ఎక్కువగా ప్రయాణిస్తుండడంతో ప్రయోగాత్మకంగా శుక్రవారం ఉదయం 5.30 నుంచే మెట్రో రైలును నడిపామని, ఆ సమయంలో ప్రయాణికుల ఆదరణ ఉండడంతో ఇక నుంచి ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచే అందించాలని నిర్ణయించామని తెలిపారు. మెట్రో రైళ్లు నగరవాసులకు ఎక్కువ సమయం అందుబాటులో ఉండేలా టైమ్ టేబుల్స్‌ను మారుస్తున్నాయని, ప్రయాణికుల



నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా మార్పులు ఉంటాయని అధికారులు తెలిపారు. మూడు కారిడార్‌లలోని టర్మినల్ మెట్రో స్టేషన్‌ల నుంచి మెట్రో రైళ్లు ఉదయం 5.30 గంటల నఉంచే అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

## శాంతి భద్రతల్లో విజబుల్ పోలీసింగ్ కీలక పాత్ర

### -కమిషనర్ సుధీర్ బాబు



సైకిల్ పెట్రోలింగ్ విధినిర్వహణలో పోలీసు బృందాలు

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:**
నగర పరిధిలోని శాంతి భద్రతలకై సాంకేతిక వినియోగంతో పాటు విజబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని రాచకొండ పోలీస్ కమీషనర్ జి.సుధీర్ బాబు అన్నారు. కమీషనరేట్ పరిధిలో విజబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యతనిస్తూ శాంతి భద్రతలకై పోలీసులు నూతన రీతిలో చర్యలు చేపట్టారు. కమీసనర్ జి.సుధీర్ బాబు ఆదేశాల మేరకు సాంకేతిక వినియోగంతో పాటు విజబుల్ పోలీసింగ్, సత్వర స్పందన అనే మూడు అంశాలపై పోలీసు బృందాలు దృష్టి పెట్టారు. నగర పరిధిలో ప్రతి ప్రాంతంలోనూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్, సైకిల్ పెట్రోలింగ్ పద్దతుల్లో పోలీసు బృందాలు విధులు నిర్వహిస్తారని కమీషనర్ తెలిపారు. 100, 112 నెంబర్లకు ప్రజల ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు బ్లూకోల్ట్స్, పెట్రో కార్ పోలీసులు తక్షణమే స్పందించి, బాధితుల వద్దకు వీలైనంత త్వరగా చేరుకుంటున్నారన్నారు. శాంతి భద్రతల కొరకు రోజూ ఉదయం, సాయంత్రం స్థానిక ఠానా సిబ్బంది పలు ప్రాంతాల్లో క్రమం తప్పకుండా సైకిల్ పెట్రోలింగ్ చేస్తారన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విధుల్లో మహిళా పోలీసుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. కమీషనరేట్ పరిధిలో అనేక మంది మహిళలు పోలీస్ శాఖలో పని చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో సమర్ధవంతంగా తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ చొరవతో అధిక సంఖ్యలో మహిళలు పోలీసు రెక్రూట్‌మెంట్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. రాచకొండ మహిళా సిబ్బంది సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. నేరాలను అరికట్టడంతో పాటు పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## మురికినీటి సమస్యపై హీరో రాజశేఖర్ ట్వీట్

### -గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు స్పందించలేదన్న రాజశేఖర్



సినీ హీరో రాజశేఖర్ ట్వీట్ చేసిన ప్రాంతం ఇదే..

**పంజగుట్ట, జూలై 29 (ప్రభాతవార్త):**
హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రోడ్డునంబర్ 70లో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని సినీ హీరో డాక్టర్ రాజశేఖర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రోడ్డు నంబర్ 70 మార్గంలోని అశ్వనీ హైట్స్‌నుంచి డ్రైనేజీ లీక్ అవుతుందని దీనిద్వారా ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా తయారైందని, ఎప్పటి నుంచో ఈ సమస్య ఈ ప్రాంతవాసులను వేధిస్తుందని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని, కిందిస్థాయిసిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి ముందుకురావాలని జీహెచ్ఎంసీ కమీషనర్, మేయర్‌లకు విజ్ఞప్తి చేస్తూ సంబంధిత ఫొటోలను ట్యాగ్ చేశారు.

## అన్నపూర్ణా స్టూడియోస్ పేరుతో నకిలీ ప్రకటన

### -సినిమా అవకాశాల పేరుతో సైబర్ నేరగాళ్ల వల

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** తమ ప్రొడక్షన్ హౌస్ పేరుతో కొత్త నటీనటుల ఎంపిక జరుగుతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో వెలువడిన అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణా స్టూడియోస్ సిబ్బంది తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన అసత్య ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దనీ, సినిమా అవకాశాల పేరుతో మోసం చేసే క్రమంలో సైబర్ నేరగాళ్ళు తమ నిర్మాణ సంస్థ పేరు వాడి నకిలీ ప్రకటనలు విడుదల చేశారని చెప్పారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన కూడా విడుదల చేశారు. అవకాశాల పేరుతో అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దంటూ, ఇటువంటి నకిలీ ప్రకటనలో అసత్య ప్రచారాన్ని నమ్మి వ్యక్తిగత వివరాలు గానీ, ఫీజ్ పేరుతో డబ్బులు గానీ పంపవద్దన్నారు. తమ నిర్మాణ సంస్థ నుంచి వచ్చే ఏ ప్రకటనలైనా అధికారికంగా రూపొందిన సామాజిక మాధ్యమాల్లోనూ, వెబ్ సైట్లలోనూ, విలేఖరుల సమావేశంలో మాత్రమే పంచుకుంటామని స్పష్టం చేశారు.

## గుండె పోటుతో కుప్పకూలిన వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ పోలీసులు



**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రోడ్డుపై హఠాత్తుగా గుండెపోటు వచ్చి పడిపోయిన వ్యక్తిని స్థానిక ట్రాఫిక్ పోలీసులు కాపాడిన ఘటన సోమవారం ఉప్పల్ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, నగరంలోని ఐటీసీ సంస్థలో పనిచేస్తున్న బీపేష్ గాజ్లే అనే వ్యక్తి భార్యతో కలిసి మేడిపల్లి ప్రాంతంలో ఉన్న తన ఇంటికి వెళ్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో చిలకానగర్ బస్‌స్టాప్ వద్ద కూలబడ్డాడు. ఈ క్రమంలో అతడు ఊపిరి తీసుకోవడానికి అవస్థ పడుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులైన ఇన్స్పెక్టర్ లక్ష్మి మాధవి, ఇన్స్‌పెక్టర్ సూర్యనాయక్, కానిస్టేబుళ్ళ బృందం గమనించారు. వెంటనే స్పందించిన పోలీసులు అతడిని బస్ స్టాప్‌లో ఒక కుర్చీలో కూర్చోబెట్టి, ఆక్యుపెంచర్ పద్దతిలో అరి చేతులు రుద్దుతూ ప్రాథమిక చికిత్సను అందించారు. బాధితుడికి కొంత ఓపిక రావడంతో చికిత్స నిమిత్తం తక్షణమే పెట్రోలింగ్ వాహనంలో వీటీ కమాన్ ప్రాంతం దగ్గరలో ఉన్న ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. అనంతరం అతడికి చికిత్స చేసిన వైద్యులు, బాధితుడిని సరైన సమయంలో తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వెల్లడించారు.

# వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు











**చార్మినార్, చాంద్రాయణగుట్ట, జూలై 29 ప్రభాతవార్త,**
డప్పుల దరువులు, బాజా భజంత్రీలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు, పూలు, పండ్లతో అలంకరించిన మాతేశ్వరీ అమ్మవారి ఘటాల వాహనాలు...ఏనుగు అంబారీపై ఊరేగించిన అక్కన్న మాదన్న శ్రీ మహంకాళీ అమ్మవారి ఘటం, వివిధ దేవాలయాలకు చెందిన ఘటాల సామూహిక ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగింది. ఘటాలను చూసి పాతబస్తీ ప్రజలు ఆధ్యాత్మికతకులోనయ్యారు. సామూహిక ఘటాల ఊరేగింపులో అడుగడుగునా వివిధ దేవాలయాల కమిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి ఘటాలకు స్వాగతం పలికారు. లాల్‌దర్వాజలో సింహవాహిణి మహాంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధానమైన ఘట్టం అమ్మవారి భవిష్యవాణి వినిపించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసినస్వాగత వేదికపై నుంచి ఉప్పుగూడ శ్రీ మహంకాళి దేవాలయం, గౌలిపురాలోని శ్రీ మహంకాళి మాతేశ్వరి భారత మాత, శ్రీకోట మైసమ్మ దేవాలయం, సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ దేవాలయం, నల్ల పోచమ్మ దేవాలయం, బేలా ముత్యాలమ్మ దేవాలయం, మురాద్ మహల్ అమ్మవారి దేవాలయం, హరిబౌలి శ్రీబంగారు మైసమ్మ దేవాలయం, రాంబక్షీ బండ అమ్మవారి దేవాలయం, అలియాబాద్ శ్రీ దర్బార్ మైసమ్మ దేవాలయం, గజానన్ వ్యాయామశాల అమ్మవారి దేవాలయం, మేకల మండి గాంధీనికేతన్ బంగారు మైసమ్మ, రాంసింగ్ బాడా మహాంకాళీ అమ్మవారి దేవాలయంకు చెందిన ఘటాలకు ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్ యాదవ్, మాణిక్ ప్రభు గౌడ్, అరవింద్ కుమార్ గౌడ్, మారుతీయాదవ్, కె.వెంటకేషలతో పాటు కమిటీ ప్రతినిధులతో కలిసి ఘటాలకు స్వాగతం పలికారు. హైదరాబాద్ పాతనగరంలో సోమవారం శ్రీ అమ్మ వారి ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. పాతబస్తీలో జరిగిన అమ్మ వారి ఘటాల సామూహిక ఊరేగింపు సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల కలగకుండ ట్రాఫిక్‌ను వేరే ప్రాంతాలు మీదుగా మళ్లించారు. పాతబస్తీలోని అన్ని ప్రాంతాలలో దక్షిణ మండలం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుఉ చేశారు. వివిధ దేవాలయాలకు చెందిన వేష ధారణాలు అమ్మ వారి ఘటాల ఊరేగింపులో భక్తులను ఎంతోగానో అకట్టుకున్నాయి. భక్తులకు రహదారులకు ఇరువైపుల నిలబడి ఎంతో ఉత్సాహంతో అమ్మవారి ఘటాల ఊరేగింపును తిలకించారు. పలు చోట్ల వేదికలు ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేధిక నుంచి పలువురు ప్రముఖులు ఊరేగింపుగా వచ్చిన అమ్మ వారి ఘటాలకు స్వాగతం పలికారు.

**భవిష్యవాణి వినిపించిన మాతంగి అనురాధ.....**
లాల్‌దర్వాజ సింహవాహిణి మహాంకాళి అమ్మవారి బోనాల జాతరలో ముఖ్యమైన ఘట్టం భవిష్యవాణి(రంగం)ను అమ్మ వారి భక్తురాలు అనురాధ సాయంత్రం 7 గంటలకు వినిపించారు. బోనాల పండుగ అత్యంత ప్రాధాన్యత కలిగిన భవిష్యవాణిని వినేందుకు వేలాది మంది భక్తులు అమ్మవారి అలయం వద్దకు విచ్చేశారు. అమ్మవారి ఆలయం ముందు పచ్చికుండపై నిలబడి అమ్మవారిని అవహింపజేసుకున్న అనురాధను ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మాణిక్ ప్రభుగౌడ్, అరవింద్ గౌడ్, కె.వెంకటేష్ అడిగిన ప్రశ్నలకు సమాధానా లు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించినందుకు ఆనందంగా ఉంది. మిమ్మల్ని నేను చల్లంగా చూసుకుం టాను. కాని చిన్నచిన్న తప్పులు చేసి పెద్ద పెద్ద ముప్పులు, అంటు వ్యాధులు తెచ్చుకుంటున్నారు. నా ఆలయాన్ని విస్తరించాలి. ఎంత పెద్దగా విస్తరిస్తే అంత పెద్దగా పండుగను నేనే జరిపించుకుంటాను, ఎవరిని ఎంత వరకు కాపాడాలో అంతవరకు కాపాడుకుంటాను అని చెప్పింది. రాబోయే రోజుల్లో విష జ్వరాలు ఉన్నాయి అనారోగ్యపావుతారని చెప్పింది. నాకు పూజలు చేస్తున్న ప్రతి ఒక్కరిని కాపాడుకుంటానని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలంటే ఐదు వారాలు చల్లని శాఖ పెట్టి బొడ్రాయి పూజ చేయాలి. కుంకుమ, పసుపు నైవేద్యంగా పెట్టి ఐదవ వారం నిండు కుండలో మారుబోనం చేస్తే అందరిని చల్లంగా చూసుకుంటానని మాతంగి అనురాధ భవిష్యవాణి వినిపించారు.

**శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ అమ్మ వారి ఘటం ఊరేగింపును ప్రారంభించిన సిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి**
పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ దేవాలయంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సోమవారం సాయంత్రం అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి (ఏనుగు అంబారిపై ఉన్న) ఘటం ఊరేగింపును ప్రారంభించారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీనివా స్‌రెడ్డి మాట్లాడుతూ అమనమ వారి దయ వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతో షాలతో ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ తరుపున కోరుకుంటున్నానని తెలిపారు. హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతికి ప్రతీక అని ఆయన తెలియజేశారు. పాత బస్తీలోని అన్ని దేవాలయాలు వద్ద, ఊరేగింపు మార్గంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని శాఖల సమన్వయంతో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నగర పోలీస్ శాఖ అదనపు పోలీస్ కమిషనర్లు విక్రమాన్ సింగ్, విశ్వ ప్రసాద్, దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రాతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## అమెరికాలో ఈతకు వెళ్లి యువకుడు మృతి

### -కుటుంబంలో విషాదం నింపిన ఘటన

**అత్తాపూర్ జూలై29, ప్రభాతవార్త :** చేతికొచ్చిన కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లిన హృదయవిదార ఘటన ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. రాజేంద్రనగర్ కాటేదాన్‌లో నివాసం ఉంటున్న గోపాల్ రెడ్డి, సమంత దంపతుల కుమారుడు అక్షిత్ రెడ్డిని ఉన్నత చదువుల కోసం మూడెళ్ల క్రితం అమెరికా పంపించారు. అయితే జూలై 21న అమెరికాలోని చికాగోలో ఈతకు వెళ్లిన అక్షిత్ రెడ్డి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూలై 27న ఆయన మృతదేహం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

## యూసుఫ్‌గూడలో రెండు కేజీల గంజాయి స్వాధీనం..

### -ఒడిశాకు చెందిన యువకుడు అరెస్ట్




జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న యాష్ అగర్వాల్

**పంజగుట్ట, జూలై 29 (ప్రభాతవార్త):**
డ్రై గంజాయి రవాణా చేస్తున్న ఓ యువకుడిని జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం రాత్రి రొటీన్ తనిఖీలలో భాగంగా హైదరాబాద్ ఎక్సయిజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసు సిబ్బంది ఆ యువకుడిని ఆపి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అతని వద్ద 2.105 కేజీల డ్రై గంజాయి లభించింది. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని గంజాయిని, మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సయిజ్ పోలీసుల విచారణలో ఒడిషాకు చెందిన యాష్ అగర్వాల్‌హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్రమ సంపాదనకు అలవాటు పడి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ పోలీసులు అతనిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పెట్రోల్ బంకుల్లో తనిఖీలేవి?

**-మీటర్ మోసాలతో ముంచుతున్న నిర్వాహకులు**
**-తూతూమంత్రంగా తూనికలు కొలతల శాఖ దాడులు**
**-సిబ్బందికి ముందుగానే సమాచారాన్ని అందిస్తున్నట్లు అనుమానాలు**
**-మామూళ్ల మత్తులో జోగుతున్న పలువురు అసిస్టెంట్ కంట్రోలర్లు**



**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:**
వాహనాలు పెరిగాయి..పెట్రో ఉత్పత్తుల వాడకమూ పెరిగింది. ప్రస్తుతం ధనిక పేద అనే తేడా లేకుండా పెట్రోల్, డీజిల్, ప్రతి ఒక్కరికీ నిత్యావసరాలుగా మారాయి. ప్రతి ఒక్కరూ ఏదోఒక వాహనం వినియోగిస్తూనే ఉనా న్నరు. వాటితో పాటు రవాణాకోసం నగర వ్యాప్తంగా అనేక రకాల వాహనాలు తిరుగతాయి. దీంతో ఇంధన వినియోగం రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుంది. ఈక్రమంలో వినియోగదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు పెట్రోల్ బంక్ డీలర్లు, బంకుల యజమానులు అక్రమాలకు పాల్పడుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. తూనికలు కొలతల అధికారుల లెక్కల ప్రకారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 500లకు పైగా పెట్రోల్ బంకులు ఉంటే అందులో హైదరాబాద్‌లో 178కాగా, రంగారెడ్డి పరిధిలో దాదాపు 330వరకు ఉంటాయి. వీటిలో చాలావరకు బంకుల్లో ట్యాంపరింగ్ చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. అలాగే హైదరాబాద్ పరిధిలోని పెట్రోల్‌బంకుల్లో అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. బంకుల్లో కొలమానాలు లేని పరిస్థితి కనిపిస్తుంది. పెట్రోల్ డీజిల్ పోయించుకునేటప్పుడు వినియోగదారుడికి కల్తీ జరిగినట్లు అనుమానం వచ్చినా, తక్కువ కొట్టినట్లు అనిపించినా చెక్ చేసుకునేందుకు ప్రతి బంకులోనూ నిర్వాహకులు పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం ఫిల్టర్ టెస్ట్ పేపర్‌ను, డెన్సిటీ హైడ్రోమీటర్, 5లీటర్ల కొలమానం ప్రతి బంకులో అందుబాటులో ఉంచాలి. ఏవినియోగదారుడు అడిగినా నిర్వాహకులు తప్పనిసరిగా వీటిని అందజేయాలి. కానీ ఎక్కడా ఆయా పరికరాలు అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. ఒకవేళ ఎవరైనా వినియోగదారుడు తప్పనిసరిగా కావాలని అడిగితే నీకు ఇష్టమైతే పోయించుకో లేకుంటే లేదు అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని వాపోతున్నారు. అరునెల క్రితం రంగారెడ్డి జిల్లా పరిధిలో 8పెట్రోల బంకుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు 5లీటర్ల పెట్రోల్‌కు 25ఎంఎల్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అదే రోజు హైదరాబాద్ పరిధిలోని 10పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి కేసు నమోదు కాలేదు. దీంతో పలువురు వినియోగదారులు కేసులు నమోదు కాకపోడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకుల సమాచారాన్ని ముందుగా చేరవేడయం వల్లే ఎలాంటి కేసులు నమోదు కాలేదని అరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దాడులకు బయలు దేరేముందు నిర్వాహకులకు సమాచారాన్ని చేరవేయడంగానీ, క్రింది స్థాయి సిబ ్బంది ద్వారా కానీ సమాచారం వెల్లడంతో బంక్‌ల నిర్వాహకులు మీటర్లను సెట్ చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అవసరమున్నపుడే దాడులు నిర్వహించి వారిని నుంచి లంచాలు వసూలు చేసుకని ఆతర్వాత చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**
బంకుల్లో వెళ్లినప్పుడు వినియోగదారులు ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా గమనించాలి. వాహనాల్లో పెట్రోల్ పోయించుకునే ముందు తప్పనిసరిగా ఎన్సూర్‌పై జీరో అయిందో లేదో చూసుకోవాలి. పెట్రోల్ యంత్రంపై తూనికలు, కొలతలు శాఖ ముద్రను గమనించాలి. పెట్రోల్‌లో వైట్ పెట్రోల్, నాఫ్తా, కిరోసిన్ కలిపే అవకాశం ఉంది. అనుమానం వస్తే వెంటనే పెట్రోల్ పేపర్‌ను తీసుకుని పరిశీలించాలి. పెట్రోల్, డీజిల్‌పై అనుమానం వస్తే డెన్సిటీ హైడ్రోమీటర్ ఇవ్వకుంటే తప్పనిసరిగా ఇవ్వాలని డిమాండ్ చేయాలి. ఎలక్ట్రానిక్ మిషన్‌లో టాంపరింగ్ అయ్యే అవకాశం ఉన్నందున అనుమానం వస్తే తప్పనిసరిగా కొలమానం అడిగి తీసుకొని కొలవాలి.

### ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**సికింద్రాబాద్, జూలై 29 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చ డంతో పాటు తెలంగాణ అమర వీరుల కుటుంబాలను ఆదుకో వాలని తెలంగాణ అమర వీరుల ఫోరం సికింద్రాబాద్ పార్లమెం ట్ కన్వీనర్ ఆర్. రాంబాబు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫోరం నేతలు సీతాఫల్‌మండిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రతి ఉద్యమకారుడికి 250 గజా ల ఇంటిస్థలం, గౌరవ పింఛన్, ఉద్యమకారులకు గుర్తింపు కార్డు లను అందజేస్తామని వాగ్దానం చేసిందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీల విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ విషయమై రాష్ట్ర ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రాన్ని పంపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దయానంద్ గంగపుత్ర, లక్ష్మణ్, నర్సింహ్మాచారి, మల్లారి అనిల్, జగన్, శ్యామ్‌రావు, జగ్దీష్, జానకీరామ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 4న డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, చిత్రంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్.వి.చెన్నారావు తదితరులు

**చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త:** పద్మవిభూషణ్ డాక్టర్ మంగ ళంపల్లి బాలమురళీకృష్ణ 94వ జయంతి మహోత్సవాన్ని జాతీయ వాయిద్య కళాకారుల సంఘం, రాగవర్ధిని కల్చరల్ సొసైటీ సౌజన్యంతో ఘనంగా నిర్వహించబోతున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వి.చెన్నారావు వివరించారు. ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మల్కాజిగిరి పార్ల మెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ ఆవిష్కరించారు. ఆగస్టు 4న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి.కిష న్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, తెలంగాణ సంగీ త నాటక అకాడమి అధ్యక్షురాలు అలేఖ పుంజల, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొంటారని వివరించారు.

### గౌడ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
#### -మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త:** గౌడ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాగ్‌లింగం పల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నూతన కమిటీ ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్, జాతీయ అధ్యక్షుడు నక్కా కృష్ణ మాట్లాడుతూ అన్ని వృత్తులోకెల్లా ప్రమాదకరమైన వృత్తి గౌడ వృత్తి అని, దా దాపు 300 ఫీట్ల ఎత్తులో చెట్లను ఎక్కి ప్రమాదకరంగా మరలా దిగడం అంటే ప్రాణాలతో సాహసంచేయడమేనని అన్నారు. కాం గ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 25శాతం కల్పించాలన్నా రు. జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయిపాపన్న జిల్లాగా నామకర ణం చేయాలని, ట్యాంక్‌బండ్‌పై సర్వాయిపాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ ప్రధాన కార్యదర్శి వెం కట్‌గౌడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దర్గా చిన్నపైల్వాన్ గౌడ్, మహిళావిభాగం జాతీయ అధ్యక్షురాలు శైలజగౌడ్, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు మాధవి, జాతీయ కార్యదర్శి ముత్యాల బాలరాజ్, సతీష్‌గౌడ్, లక్ష్మణ్, మహేందర్‌గౌడ్, బుద్దిలక్ష్మణ్, శ్రీకాం త్‌గౌడ్, రామ్మోహన్‌గౌడ్, వికాస్, నక్కా శ్రీకాంత్ పాల్గొన్నారు.

### శాంతి,మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్,ఫీస్ అండ్ వెల్ఫేర్ కమిటి సెంట్రల్ జోన్ అధ్యక్షులు శ్రీ కిషన్ శర్మ

**చార్మినార్,జూలై 29 ప్రభాతవార్త :** శాంతి మత సామ రస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఫీస్ అండ్ వెల్ఫేర్ కమిటి సెంట్రల్ జోన్ అధ్యక్షులు శ్రీ కిషన్ శర్మ అన్నారు.పాతబస్తీలో సోమవారం జరిగిన శ్రీ మాతేశ్వరీ అమ్మ వారి ఘటాల ఊరేగిం పుకు శాంతి సంక్షేమ సంఘం తరుపున స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్ మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలు సంద ర్భంగా పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫీస్ అండ్ వెల్ఫేర్ కమిటికి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

### పోచమ్మ దేవాలయంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్ కుమార్ యాదవ్

**చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త:** అచ్చయ్యనగర్‌లోని పోచ మ్మ దేవాలయంలో సోమవారం రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్ కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత అరవిందకుమార్‌యాదవ్, ముషీరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజియాదవ్ తదితరులు పాల్గొన్నా రు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వేదపండి తులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

### బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖేష్ గౌడ్
### వర్ధంతి సభలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ జూలై29,ప్రభాతవార్త :**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరుపేదల పాలిట కల్పతరు వు మాజీ మంత్రివర్యులు ముఖేష్ గౌడ్ అన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.సోమవారం కీ.శే ముఖేష్ గౌడ్ 5 వర్ధంతిని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై ముఖేష్ గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే ముఖేష్ గౌడ్ పేదలకు కోసం చేసిన సేవలు ఎప్పటికి మారవలే నివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు పాల్గొన్నారు.

# ముగిసిన దర్భార్ మైసమ్మ బోనాల ఉత్సవాలు

**-మూడవ రోజు గావు పట్టుడు, బలిగంప ఊరేగింపు**
**-భవిష్యవాణి వినిపించిన సుశీలమ్మ**
**-పూజల పట్ల సంతృప్తి చెందిన అమ్మవారు**
**-పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు**



బలిగంప ఊరేగింపులో భక్తులు

**మెహిదీపట్నం, జూలై 29, ప్రభాతవార్త :**

కార్వాన్ దర్బార్ మైసమ్మ, మహంకాళి దేవి అమ్మవార్ల ఉమ్మడి బోనాల ఉత్స వాలు సోమవారం ముగిసాయి. మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావర ణంలో కొనసాగిన బోనాల ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అధికారులతో పాటు స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. దేవాలయ కమిటీ చైర్మర్ ఠాకూర్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుండ అన్ని ఏర్పాట్లు చేయగా, దేవాదాయశాఖ అధికారులతో పాటు వివిద ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను చేశారు. సోమవారం ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకు నేందుకు భక్తులు బారీగా తరలిరావడంతో కార్వాన్ పరిసర ప్రాంతాలన్ని అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగాయి. మూడవ రోజు అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, అడిషినల్ డీసీపీ నర్సయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతరాజు మహంకాళి దేవాలయం నుంచి బయలుదేరి నల్లపోచమ్మ దేవాలయం వద్ద గావు పట్టుడు, రంగం, బలిగంప ఊరేగింపు, విద్యార్థులకు బహుమతుల ప్రధానం, ఫలహారపు బండ్ల స్వాగతం, అమ్మవారి తొట్టెల నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ జి.రాము లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.

### తప్పులకు శిక్షతప్పదు : భవిష్యవాణిలో సుశీలమ్మ

కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన రంగం కార్యక్రమంలో సుశీలమ్మ పాల్గొని భవిష్యవాణి వినిపించారు. తనకు చేసిన పూజల పట్ల సంతృప్తి వ్యక్తం చేశానని, తప్పులు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. వర్షాలు బాగా కురిసి, పాడి పంటలు సంవృద్ధిగా కురుస్తాయని తెలిపారు. మరో 7 వారా ల పాటు దర్భార్ మైసమ్మకు సాకలు పోయడంతో పాటు సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేయాలని పేర్కొన్నారు.

## ప్రతి కళాశాలలో ఆచార్య జయశంకర్ జయంతి వారోత్సవాలు నిర్వహించాలి

**-తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి**



ప్రసంగిస్తున్న తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి

**చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత ఆచార్య జయశంకర్ జయంతి వారోత్సవాలను రాష్ట్రంలోని ప్రతి కళాశాలలో నిర్వహించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి కోరారు. సోమవారం తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టిఎల్‌ఎఫ్), అనుబంధ సంఘాల ఆధ్వర్యం లో టిఎల్ఎఫ్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రముఖ్యసభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ విద్యావిదానంలో సమూల మార్పు కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సమావేశం అభినందిం చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కొనసాగింపుగా తెలం గాణ లెక్చరర్స్ ఫోరం ప్రతి జిల్లా కేంద్రంలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు నిష్ణాతులైన విద్యావంతులను ఒకేవేదికపైకి తీసుకువచ్చి విద్యాసదస్సులను నిర్వహించాలని, మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులతో పాటు నిబంధనలకు అనుకూలంగా స్థానచలనం వెనువెంటనే పూర్తి చేయాలని, మిగిలిన ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి 12 నెలల గౌరవ వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్‌కార్డులు కల్పించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమా వేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణయ్య, వేణు, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గోపినాథ్, అక్రమం, ఫరీద్, తిరుపతి, రవి, జనార్దన్, ఆంజనేయులు, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశంకు సినారె సాహితీ పురస్కారం

**రవీంద్రభారతి, జూలై 29 ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, యువకళావాహిని సంయుక్త ఆధ్వర్యం లో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి.నారాయణరెడ్డి 93వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశంకు డా. సి.నారాయణరెడ్డి సాహితీ పుర స్కారం ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తెలిపారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి పాల్గొని విశిష్ట అతిథులు సారిపల్లి కొండలరావు, రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, సి.ఎల్.ఎన్.గాంధీ, శైలజామిత్ర, ఎస్.వి.రామారావు తదితరులతో కలిసి ఈ నెల 31 బుధవారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. ఓలేటి పార్వతీశంను ఘనంగా సత్కరించి డా. సి.నారాయణరెడ్డి సాహితీ పురస్కారం ప్రదానం చేస్తారని లక్ష్మీనారాయణ వివరించారు. సభకుముందు సాహితీ సవ్యసాచి సినారె లఘుచిత్ర ప్రదర్శన; వర్ధమాన గాయకులచే సినారె మధురగీతాలు శీర్షికన సినారె వ్రాసిన ఆణిముత్యాల్లాంటి సినీగీతాల ఆలాపన ఉంటాయని పేర్కొన్నారు.

### తార్నాకలో బోనాల ఉత్సవాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు మోహన్

**తార్నాక, జూలై 29 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్‌లోని లాలాపేట్‌లోగల పోచమ్మ దేవాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకుల ఆహ్వానం మేరకు బండి సంజయ్ అమ్మవారిని దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, మున్నూరు కాపు సంఘం నాయకులు, బీజేపీ నాయకులు గర్షమో హన్, కార్యదర్శి పార్వతి పరమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ మంత్రిని ఘనంగా సత్కరించారు.

### దేవాలయాల్లో మాజీ కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



మహంకాళి ఆలయంలో పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త తదితరులు

**ప్రభాతవార్త అబిడ్స్ ప్రతినిధి:** బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త దంపతులు ప్రత్యేక పూజలను చేశారు.గోషామహల్,నాంపల్లి,చార్మినార్ నియోజకవర్గాల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో బోనాల ఉత్సవాల ఊరేగింపును అడంబరంగా నిర్వహిం చారు.జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ గౌలిగూడ మహంకాళి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. శాలువ కప్పి సన్మానించారు.ఆలయంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూతెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ బోనాల ఉత్సవాలన్నారు. హోరెత్తిన జానపద నృత్యాలు... తెలంగాణ ప్రాంత వాసులు,జానపద నృత్యాలు,జానపద గేయాలు ప్రాచీన సంప్రదా యాలతో హైటెక్ నగరంలో ఉన్న తమ సంస్కృతిని,సంప్రదాయాన్ని ఏమాత్రం మరిచి పోలేదని బోనాలలో నిరూపించుకున్నారు. ఆదివారం ఆయా దేవాలయాల వద్ద మైకుల లో వినిపించే అమ్మవారి జానపద గీతాలతో సంబరాలను చూసేందుకుగాను భక్తులు ఎంతో ఆసక్తి చూపారు.బోనాలను నెత్తిన పెట్టుకుని శివసత్తులు,పోతరాజులు ఓం నమ శివాయ అంటూ చేతిలోని కొరడాలను జులిపిస్తూ పరుగులు తీస్తూ భక్తులకు ఆశీర్వాదాలి చ్చారు.బాజా భంత్రీల మధ్య యువకుల కేరింతలు నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. దీంతో మైకులు హోరెత్తాయి.

## ముఖేష్ గౌడ్‌కు ప్రముఖుల నివాళులు

**గోషామహల్,జూలై 29ప్రభాతవార్త:** దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ మంత్రిమూల ముఖేష్‌గౌడ్ నిస్వార్ధ ప్రజా సేవకుడిగా,పేద ప్రజల పెన్నిదిగా ప్రజలకు సేవలందించినగొప్ప నాయకుడని ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు.మాజీ మంత్రి మూల ముఖేష్‌గౌడ్ ఐదవ వర్ధంతిన్ని పురస్కరించుకుని ఆయన కుమారుడుమూల విక్రమ్‌గౌడ్ సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన ముఖేష్‌గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కు మార్‌రెడ్డి,శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు హాజరై ముఖేష్‌గౌడ్ చిత్రపటం వద్ద పూవ్వులు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడి న కులాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.రాష్ట్ర ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు.గోషామహల్ నియోజక వర్గం ప్రజలకు ఆయన తీరని లోటన్నారు.ఆయన దూరమై ఐదు సంవత్సరాల కాలం అవుతున్నప్పటికి ప్రజలు ఆయన స్మృతులను మరిచిపోలేక పోతున్నారన్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి పార్టీలకు అతీతకంగా తరలి రావడమే కాకుండా అభిమానులు పెద్ద ఎత్తున్న వచ్చి ముఖేష్‌గౌడ్‌కు నివాళ్లు అర్పించారు.ఈ ముఖేష్‌గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో బిజెపి నాయకులు



బోనాల ఉత్సవాలల్లో పాల్గొన్న బిజెపి నాయకులు గోవింద్‌ంరి

**బేగంబజార్,జూలై 29 ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలల్లో భాగంగా ఆదివారం జరిగిన బోనాల తొట్టెల,బోనాల ఊరేగింపులో బిజెపి నాయకులు గోవింద్‌రాఠి పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.గోషామహల్ నియోజకవర్గంలోని తుల్జాగూడ,ట్రూప్‌బజార్, మంగళ్ హాట్,దూల్‌పేట్,గోడేకికబర్,బేగంబజార్ తదితర ప్రాంతాలలో దేవాలయాల్లో అమ్మ వారికి పూజలను చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ స ంప్రదా యాలు,సంస్కృతి అద్దం పట్టే విధంగా తెలంగాణ ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు.తదితరులు పాల్గొన్నారు.

### బోనాలు వేడుకల్లో పాల్గొన్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు



బోనాలు ఉత్సవాల్లో పాల్గొన్న టిపిసిసి మహిళా విభాగం పూర్వ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్

**చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం పూర్వప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ సోమవారం బోనాలు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. చిక్కడపల్లి, జవహర్‌నగర్ తదితర ప్రాంతాలల్లో నల్లపోచమ్మ దేవాల యాల్లో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ ఆలీ షబ్బీర్‌కు మంత్రి పదవి రావాలని, వచ్చిన వెంబడే బోనం తీస్తానని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్‌బాబు, సురేందర్ పాల్గొన్నారు.

## సామాజికన్యాయ స్ఫూర్తిప్రదాత జైపాల్‌రెడ్డి

**-రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**



సభలో ప్రసంగిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, కుమారస్వామి తదితర నాయకులు

**నాంపల్లి, జూలై 29 ప్రభాతవార్త :** ఉన్నతవర్గంలో జన్మించినా జీవితాంతం సమసమాజాన్ని ఆకాంక్షించిన దార్శనికులలో రాజకీయ ప్రముఖుడైన సూదిని జైపాల్‌రెడ్డి సామాజికన్యాయ స్ఫూర్తిప్రదాత అని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. మండల కమిషన్ నివేదికతో వి.పి.సింగ్ ప్రభుత్వం బిసిలకు కేంద్రప్రభుత్వ ఉద్యోగాల లో 27శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టినప్పుడు నాటి ప్రభుత్వంలో కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి సేవలు అనిర్వచనీయం, చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకున్నాయని తెలిపారు. జాతీయ బిసిదళ్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆధ్వర్యంలో సామాజిక న్యాయం-ఎస్.జైపాల్‌రెడ్డి అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా వకుళాభరణం పాల్గొని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలితో అంజలి ఘటించి ఘననివాళులర్పించారు. కుమారస్వామి అధ్యక్షోపన్యాసంలో దేశంలోనే మెజార్టీ జనాభా కలిగిన బిసిలు అన్నిరంగాల్లో ఎదిగినప్పుడే దేశం ప్రగతిపథంలో పయనిస్తుందని జైపాల్‌రెడ్డి తనవంతు కర్తవ్యంగా అందుకు చేసిన విశేషకృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ భాగయ్య, డా. వెంకటరమణ, యుగంధర్‌గౌడ్, రేఖారాణి, డా. సరోజనమ్మ, గాదె సమ్మయ్య. రాధిక, శ్రీనివాస్, జి.సతీష్, మురళీకృష్ణ, లక్ష్మణ్‌యాదవ్, పెరిక మహేష్, రఘుపతి ముదిరాజ్ తదితరులతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలు

### జిమ్‌క్విన్‌లో గాడియంకు 170 పథకాలు




వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

**హైదరాబాద్, జూలై 29,ప్రభాతవార్త:**

నగరంలోని గాడియం స్కూల్‌వేదికగా రెండురోజులపాటు జరిగినఅఖిలభారత స్థాయి జిమ్నాస్టిక్ పోటీలు జిమ్‌క్విన్ 2024 విజయవంతంగా ముగిసాయి. గాడియం స్పోర్టోపియాలో జరిగిన ఈటోర్నీలో దేశవ్యాప్తంగా 600మంది జిమ్నాస్టులు పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈపోటీల్లో 170పథకాలు సాధించిన అతిథ్య గాడియం స్కూల్ విజేతగా నిలిచింది. లెవల్1,2 పోటీల్లో స్థానిక సిమ్నాస్ట్‌లు 146 పతకాలు నెగ్గారు. అందులో 98 స్వర్ణపతకాలు ఉన్నాయి. లెవల్3,4,6స్థాయి పోటీల్లో ఆరుగురు గాడియం జిమ్నాస్టులు మరో 15స్వర్ణాలు సుహా 24పత కాలు సొంతం చేసుకున్నారు. ఈపోటీల ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా అరబిందో పార్మా డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, నిత్యానందరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా గాడియం వ్యవస్థాపకురాలు కీర్తిరెడ్డి మాట్లాడుతూ అథ్లెటిక్ నైపుణ్యాన్ని పెంపొందించడంతోపాటు సమగ్ర అభివృద్ధికి తమ స్కూల్‌కు ఉన్న అంకితభావానికి జిమ్‌క్విన్ పోటీలు నిదర్శనమన్నారు. గాయిం 10వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈకార్యక్రమం నిర్వహించడం గర్వించదగ్గ మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈఅద్భుత వారస్వాన్ని కొనసాగిస్తామని కీర్తిరెడ్డి పేర్కొన్నారు.

### సుల్తాన్ షాహిలో ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



**చార్మినార్,జూలై 29 ప్రభాతవార్త :** పాతబస్తీ సుల్తాన్‌షాహిలో సోమవారం అత్యంత వైభవంగా శ్రీ జగదాంబ మందిరం కమిటి అధ్యక్షులు రాకేష్ తివారీ ఆధ్వర్యంలో శ్రీ అమ్మ వారి ఘటం ఊరేగింపు జరిగింది.భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి శ్రద్దలతో అమ్మ వారికి పూజలు నిర్వహించారు.అమ్మవారి ఘటం ఊరేగింపు సుల్తాన్ షాహి నుంచి ప్రారంభమై నయాపూల్ వరకు కొనసాగింది.ఊరేగింపులో అమ్మ వారి చిత్రాలు,శ్రీ హనుమంతుడు,దుర్గాదేవి చిత్రాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ సందర్భంగా సుల్తాన్ షాహిలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు

### తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక

**-బిజెపి నాయకుడు బొక్క బాల్ రెడ్డి**



**అత్తాపూర్ జూలై29,ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక అన్ని రాష్ట్ర బిజెపి నాయకుడు బొక్క బాల్ రెడ్డి పేర్కొ న్నారు.సోమవారం ఉప్పర్‌పల్లిలో బోనాల వేడుకలు ఘనంగా జరిగా యి.బిజెపి నాయకులు బొక్క బాల్ రెడ్డి చెల్లి నిర్వహించిన బోనాల వేడుకల్లో అన్నతో కలిసి పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి మొ క్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి దయతో అంద రూ సుఖ:సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపా రు.కేంద్ర సహకారంతో బోనాల పండుగకి ఇంకా పేరు వచ్చేలా చూస్తా నని ఎంపి డికె అరుణ ప్రకటించడం హర్షణియమని పేర్కొన్నారు.

### నేటి ధర్నాను విజయవంతం చేయాలి

**-జిల్లా ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్**

**అత్తాపూర్ జూలై29,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాలయాపన చేస్తుందని రంగారెడ్డి జిల్లా ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు.సోమవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ....పార్టీ ఆదేశాల మేరకు రంగారె డ్డి అర్బన్ జిల్లా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి ఎన్నికల సభలో బిసి డిక్లరేషన్ ద్వారా రాష్ట్రంలోని బిసిలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరిపై నేడు (మంగళవారం ) రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కావున ప్రతి డివిజ న్ నుండి బిజెపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ జూలై29,ప్రభాతవార్త :** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన నివాసంలో సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి స్పీకర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్ష లు తెలియజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి పలు విషయాలు చర్చించారు.

## బోనాల పండుగ వేళ వ్యక్తి ఆత్మహత్య

**చిక్కడపల్లి, జూలై 29 ప్రభాతవార్త:** బోనాల పండుగ వేళ ఓ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఉరివేసకుని ఆత్మహత్యచేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ మౌనిక తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆదివారం రాత్రి అచ్చయ్య నగర్ ప్రాంతానికి చెందిదిన పి.కుమారస్వామి(27) ఫ్లవర్ డెకరేషన్ వ్యాపారం నిర్వహిస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొన్ని సంవత్సరాల నుంచి తన భార్య అఖిల మూడు సంవత్సరాల కూతురు మాన్యశ్రీతో కలిసి అదే ప్రాంతంలో నివాసముంటున్నారు. గత కొన్ని నెలల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడి అనునిత్యం ఘర్షణపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆదివా రం బోనాల సందర్భంగా ఇంట్లో పూజ కార్యక్రమాలను ఇరువురు కలిసి చేసుకున్నారు. రాత్రి భర్తతో కలిసి భోజనంచేయాలని సంకల్పిం చి ఇంట్లోని మొదటి అంతస్తులో ఉన్న భర్త కుమారస్వామిని పిలవడా నికి వెళ్లగా ఎంతకూ తలుపులు తెరవకపోవడంతో తలుపులు పగుల గొట్టి తెరిచి చూడగా ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకుని ఉండడం కని పించింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన భార్య అఖిల తన కుటుంబ సభ్యులకు అనంతరం చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందిం చారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ మౌనిక సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక కేసును నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడం మూలంగానే కుమాస్వామి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, జూలై 29, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కార్యాలయంలో 19వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ నందిగామ మహేష్ ముదిరాజ్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రాము, కళ్యాణ్, రాకేష్, మహేష్ వారి బృందం సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారికి హన్మంత్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి సాదరంఘా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నాయకురాలి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని**

**సికింద్రాబాద్, జూలై 29 ప్రభాతవార్త:** బన్సీలాల్‌పేట డివిజన్‌లోని భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు సుజాత ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం బన్సీలాల్‌పేట స్మశాన వాటికలో నిర్వహించిన అంత్యక్రియలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై ఆమె పార్థివదేహం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

**హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ప్రకారం తనకు పదోన్నతి కల్పించాలి**

**-వికలాంగ టీచర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**సైఫాబాద్, జులై 29 ప్రభాతవార్త:** వికలాంగుడైన తనకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం పదోన్నతి కల్పించకుండా అన్యాయం చేస్తున్న విద్యా శాఖాధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆసిఫ్‌నగర్, మంగార్‌బస్తీ సిసి నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జిటి టీచర్ బూర శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు న్యాయం చేయాలని ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా శాఖ అధికారి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తనకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం పదోన్నతి కల్పించకుండా ఇతరులకు కల్పించారని ఆయన ఆరోపించారు. తాను ఇంగ్లీషులో ఎస్ఎ ప్రమోషన్ కోసం హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని, రోస్టర్ రూల్స్ ప్రకారం తనకు పదోన్నతి కల్పించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, విద్యా శాఖాధికారి రోహిణి తనకు పదోన్నతి కల్పించకుండా అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. విద్యాశాఖ అధికారి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపైన విచారణ జరిపించాలని, అలాగే తనకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

## ప్రతిభను చాటిన నృత్య కళాకారులు

**సైఫాబాద్, జులై 29 ప్రభాతవార్త:**



జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్ని శ్రీవల్లి

గురుపూజోత్సవం, తెలంగాణ బోనాలు ఉత్సవం-2024ను పురస్కరించుకుని విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో బిర్లా సైన్స్ సెంటర్‌లోని శ్రీభాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ నృత్య కళాకారులు తమ ప్రతిభను చాటారు. శ్రీనటరాజ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక గురువు కె.వి. బ్యూలా శిష్య బృందం చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శనకు శ్రీవ ల్లి అనే చిన్నారికి, తోటి కళాకారులకు అతిథులు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను బహుకరించారు. అలాగే వారి గురువులను కూడా సత్కరించారు.

**బోయిన్‌పల్లి బోనాల వేడుకల్లో మహేశ్వర్ రెడ్డి**

**కంటోన్మెంట్, జూలై29ప్రభాతవార్త:** ఆషాడమాసం బోనాల మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి, చిన్నతోకట్ట సంజీవయ్య నగర్, నేతాజీ నగర్‌లలో వివిధ ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన బోనాలు, పలహారం బండి, తొట్టెల ఊరేగింపు, పోతరాజుల వీరంగాల వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు జె.ఎం. ఆర్.కు. శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, సుందర్ రాజ్, దయానంద్, రాజు, కాంతరాజు, విజయ్, శ్రీధర్, బాలక్రిష్ణ, యాదగిరి, టింకు, లడ్డూ తదితరులు పాల్గొన్నారు.

**సాంస్కృతికి నిదర్శనం బోనాల జాతర : జంపనప్రతాప్**

**కంటోన్మెంట్, జూలై 29 ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతికి బోనాల జాతర నిదర్శణమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. బోనాల వేడుకలను పురస్కరించుకొని కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో జంపన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజిత్, పవన్, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



అడ్డగుట్ట బోనాల వేడుకల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

**అడ్డగుట్ట, జూలై 29 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన బోనాలు, పలహారపు బండి ఊరేగింపులో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, వడ్డెర ఎల్లయ్య, దేవయ్య, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## మారేడ్‌పల్లి పలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే శ్రీగణేష్



మారేడ్‌పల్లి మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూలై29 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీ మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాలు, పలహార బండి ఊరేగింపు వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఆలయ నిర్వాహకులు సి.క్రిష్ణ యాదవ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు వైష్ణవిలు పాల్గొని వారికి శాలువకప్పి ఘనంగా సత్కరించారు.

## హిందూ బహుజన మేధావులపై దాడులను ఖండిస్తున్నాం

**-డాక్టర్ కదిరే కృష్ణపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి**

**-బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుకేయాదవ్**

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:**

హిందుత్వంపై ప్రశ్నిస్తున్న హిందూ బహుజన మేధావులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని డాక్టర్ కదిరే కృష్ణపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బిహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు వాసుకేయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో " ఆది హిందూబహుజనులపై ఆర్యమనువాదుల దాడులను ఖండిద్దాం "అనేఅంశంపై మేధావులు మహిళా విద్యార్థి సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి సమాజ్‌వాది పార్టీ అధ్యక్షులు సింహాద్రి, ప్రొఫెసర్ ఖాశీం, బిసి హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు సిద్దేశ్వర్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో హిందుత్వం ముసుగులో బిజెపి, ఆర్ఎస్ఎస్ దళిత, బహుజనులపై దాడులకు పాల్పడుతుందన్నారు. జాతీయ వాదం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వాసుకేయాదవ్, సింహాద్రి, సిద్దేశ్వర్ తదితరులు

పేరుతో అరాచకశక్తులను ప్రోత్సహిస్తుందన్నారు. భారత దేశంలో ఉన్నది హిందుత్వ సిద్ధాంతం కాదని..బ్రాహ్మణ సిద్ధాతమని ఆరోపించారు. మోడీ కేవలం ప్రభుత్వంలో రోబోమాత్రమేనని పాలనమొత్తం ఆర్ఎస్ఎస్ చేతిలో ఉందన్నారు. ఆవులు మీద , హిందులపై చర్చ చేస్తే బిజెపికే లాభమని ఇప్పుడు దళితబహుజనులంతా కాస్ట్ సెన్సెస్‌పై చర్చ చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కుమారస్వామి, హైకోర్టు అడ్వకేట్ పద్మారావు, లంబాడీ హక్కుల సంఘం దాసురాం నాయక్, సోషల్‌జస్టిస్ జేఏసీ ప్రభంజన్ యాదవ్, రాకేష్ , సునీతాగౌడ్ , పెద్దన్న, చెరుకు రాంచందర్, సొగారా బేగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫతేనగర్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**-పలహారం బండి ఊరేగింపు..**



బోనాల వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 29, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో ఆషాడమాసం బోనాల ఉత్సవాలు సోమవారం ఫతేనగర్ డివిజన్‌లో రమేష్ ఇతర బస్తీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కర్క వేణుగోపాల్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పలహారం బండిని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తివారి, లక్ష్మణ్ రాజు ముదిరాజ్, రమేష్, మాధురి రాము, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మోండా డివిజన్ బోనాల వేడుకల్లో బండి సంజయ్**



మోండా డివిజన్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**కంటోన్మెంట్, జూలై 29 ప్రభాతవార్త:**

బోనాల వేడుకలను పురస్కరించుకొని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక అధ్వర్యంలో వెస్ట్ మారేడ్‌పల్లిలో నిర్వహించిన బోనాల వేడుకలకు కేంద్ర మంత్రి బండి సంజయ్, బిజెపి రాష్ట్ర నాయకులు మనోహర్ రెడ్డి, చాడ సురేశ్ రెడ్డి, సంగప్ప, సుధాకర్, కంటోన్మెంట్‌కు చెందిన బిజెపి నాయకులు కొంతం నరేశ్, చిన్న వీరయ్య, రాజ్‌గోపాల్‌తో పాటు కొంతం దీపిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడే డయల్ యువర్ డిఎం

**కంటోన్మెంట్, జూలై 29 ప్రభాతవార్త:** ఆర్టీసి కంటోన్మెంట్ డిపో పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సలహాలు, సూచనల కోసం మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ డి.సుధాకర్ రావ్ తెలిపారు. నగరంలోని వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి పరిష్కారానికి 9959226143 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడు డయల్ యువర్ ఆర్.ఎం.

కంటోన్మెంట్, జూలై29 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రీజియన్ పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సలహాలు, సూచనలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య డయల్ యువర్ ఆర్.ఎం. కార్యక్రమం నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ ఆర్.ఎం. ఖుస్రోషాఖాన్ తెలిపారు. ప్రయాణికులు డయల్ యువర్ ఆర్.ఎం. నెం 9959900808, డిప్యూటీ ఆర్ఎం.(ఓ) కె.పి.9959226148, డిప్యూటీ ఆర్ఎం.(ఓ) ఎసికింద్రాబాద్ 9959226142 నెంబర్లను సంప్రదించాలని ఆర్.ఎం.ఖాన్ తెలిపారు.

**ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ**



చెక్కులను పంపిణీ చేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 29, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం కాలనీవాసి కొత్తగొల్ల రమేష్, వేశ్నో సోహన్ దాస్‌లు ఆరోగ్యం బాగోలేక చికిత్స చేయించుకున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేనందున చికిత్స అనంతరం గొట్టిముక్కల వెంకటేశ్వరరావును కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. బండి రమేష్ సహకారంతో కొత్తగొల్ల రమేష్‌కు రూ. 30,000, సోహన్ దాస్‌కు రూ. 12,000 మంజూరు అయ్యాయి. మంజూరైన సంబంధిత చెక్కును సోమవారం జీవిఆరన కార్యాలయంలో బండి రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, మేకల రమేస్, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేపోలీసుల వివరాల ప్రకారం, గుర్తు తెలియని వ్యక్తి(45) ఆదివారం రాత్రి ఫలక్‌నామా, ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా, ఆ సమయంలో హఠాత్తుగా తన ఎదురుగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదకర ఘటనలో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చుట్టుపక్కల వారి సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు 5.4 అడుగుల ఎత్తు ఉన్నాడని, పసుపు రంగు చొక్కా, నల్ల ప్యాంటు వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## భక్తులను సంతోషంగా చూసుకుంటా

**-పూజలు ఆనందం కలిగించాయి**

**-శ్రీభూలక్ష్మి దేవాలయం రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత**



శ్రీభూలక్ష్మి అమ్మ వారి ఆలయం వద్ద రంగం కార్యక్రమంలో భవిష్యవాణి విన్పిస్తున్న మాతంగి స్వర్ణలత.

**బేగంపేట జూలై 29, ప్రభాతవార్త**

నా భక్తులను సంతోషంగా చూసుకుంటా. మొదటి సారి ఘటోత్సవ కార్యక్రమం నిర్వహించడం సంతోషం. మీరు చేసిన పూజలు ఆనందం కలిగించాయి. అంటూ రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. సోమవారం బేగంపేట ప్రకాశం నగర్ శ్రీభూలక్ష్మి దేవాలయంలో ఆషాడ మాస బోనాల కార్యక్రమంలో భాగంగా రంగం(భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత ఈ ఏడాది రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి రైతులు ఆనందంతో ఉంటారని, తన భక్తులను అంటు రోగాల నుంచి కాపాడుకుంటానని, ఆలయంలో నిర్వహించిన పూజలపై తనకు ఆనందం కలిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణదాత విశాల్ సూథం, ఈ ఓ విఠలయ్యల ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, కృష్ణ, తుకారం, వెంకటేష్, అశోక్, సాయి, గోవిందరావు, సత్యనారాయణ, శేఖర్, నరసింహ, లక్ష్మీనారాయణ, ధీరజ్, రఘునాథ్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భవిష్య వాణి కార్యక్రమాన్ని విని తరించారు.

## సంక్షేమ సంఘం సమగ్రాభివృద్ధికి తనవంతు పాటుపడతా



మానిఫెస్టోని ఆవిష్కరిస్తున్న అధ్యక్ష అభ్యర్థి దేవరింటి మస్తాన్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, జూలై 29, ప్రభాతవార్త :**

వివేకానందనగర్ కాలనీ సంక్షేమ సంఘం సమగ్రాభివృద్ధికి తన వంతు పాటుపడతానని అధ్యక్ష అభ్యర్థి దేవరింటి మస్తాన్‌రెడ్డి అన్నారు. ఆగష్టు 4వ తేదిన ఆదివారం శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు గాను ఇప్పటికే దేవరింటి మస్తాన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను సోమవారం కాలనీలోని కనకదుర్గ మాత, నల్లపోచమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి తన మద్దతుదారులతో కలిసి మానిఫెస్టోని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఒకసారి అవకాశం కల్పించాలని కాలనీలో ఎన్నో ఏళ్ళుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ని డివిజన్ వార్డు కార్యాలయంగా వినియోగిస్తున్నారని దీనితో కాలనీ వాసుల సమావేశానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని కమ్యూనిటీ హాల్‌ను కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన అజండాగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. అదేవిధంగా కాలనీలో ఉన్న ఆలయాలలోని పూజారులకు సొంత నివాసం లేక కష్టపడుతున్నారని ఆలయ పూజారులకు నివాసాలు కల్పిస్తామన్నారు. కాలనీలో పూర్తి స్థాయి అంతర్గత సిసిరోడ్లు నిర్మిస్తామని డ్రైనేజి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. కాలనీలో ఏర్పాటుచేసిన సిసికెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీకి సంబందించిన హిందు స్మశాన వాటికను ప్రభుత్వం ద్వారా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఓటు వేయాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు.

## జిహెచ్‌ఎంసిని అప్పులపాలు చేసిన ఘనత సోమేష్ కుమార్‌దే

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా**



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నేత సాయిబాబా

**ముషీరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉన్న జీహెచ్‌ఎంసీని అప్పుల పాలు చేసిన ఘనత అప్పటి జీహెచ్‌ఎంసీ కమీషనర్ సోమేష్‌కుమార్‌దేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరుతో సుమారు వెయ్యి కోట్ల పన్ను ఎగవేత కుంభకోణంలో ప్రధాన సూత్రధారి అయిన సోమేష్‌కుమార్ గతంలో కూడా అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ తన అవినీతి యజ్ఞానికి సహకరించాలనే దురుద్దేశ్యంతో పదవీ కాలం ముగిసిన తరువాత కూడా అదే స్థానంలో సోమేష్‌కుమార్‌ను కొనసాగించారని ధ్వజమెత్తారు. ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడిన సోమేష్‌కుమార్‌ను తక్షణమే అదుపులోకి తీసుకుని, ఆయన వల్ల జరిగిన నష్టాన్ని తిరిగి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, శుక్రావేది పాల్గొన్నారు.

## మైసమ్మ అమ్మవారిని వేడుకుంటే కోరన కోర్కెలు నెరవేరుతాయి : భట్టి

**కంటోన్మెంట్, జూలై29ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ప్రసిద్ధిగాంచిన మారేడ్‌పల్లి శ్రీ మైసమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పలహారం బండి ఊరేగింపు బారీ ఎత్తున నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, సీనియర్ కాంగ్రెస్ నేతలు చిరబోయిన క్రిష్ణ యాదవ్ (గొల్లకిట్టు), తిరుమల్ వంశీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, రాజ్య సభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌లతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, గొల్లకిట్టు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాలన్నీ మారుమ్రోగాయి. ఈ సందర్భంగా మంత్రి భట్టి మాట్లాడుతూ మారేడ్‌పల్లి అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను గొల్లకిట్టు కూతురు, కాంగ్రెస్ నాయకురాలు చిరబోయిన వైష్ణవి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



మారేడ్‌పల్లి బోనాలు పలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీగణేష్, గొల్లకిట్టు తదితరులు

## 31న సికింద్రాబాద్ స్థూపానికి పాలాభిషేకం

**-స్థూపం ఏర్పాటు చేసి 200 సంవత్సరాలు పూర్తి**

**-లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్**

**బేగంపేట జులై 29, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ నగరం ఏర్పడి 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 31వ తేదీన స్థూపానికి లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయాలని నిర్ణయించినట్లు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేసారు. 2006వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా బుద్ధభవనన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్థూపానికి 31వతేదీన ఉదయం గం 11లకు పాలాభిషేకం చేయనున్నామని పవన్‌కుమార్ గౌడ్ తెలియజేసారు. 2006వ సంవత్సరంలో సికింద్రాబాద్ నగరానికి 200ఏళ్ల పూర్తయిన సందర్భంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వేడుకలను వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించిందని, ముగింపు వేడుకలకు అప్పటి ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాజరై 200కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీని కూడా ప్రకటించారని గుర్తు చేసారు. ఆ నిధులతో సికింద్రాబాద్ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుపుతామని హామీ ఇచ్చారన్నరు. అనంతరం జరిగిన హెలిక్యాప్టర్ ప్రమాదంలో వైఎస్ఆర్ మరణించారని, వేడుకలు జరిగి 18ఏళ్ల పూర్తి అయినప్పటికీ దాని గురించి పట్టించుకున్న అధికారి గానీ,




ప్రజాప్రతినిధులు గానీ లేరని, ఆయన అన్నారు. వివక్షకు గురవుతున్న సికింద్రాబాద్ నగరానికి ఇప్పటి పాలకులైనా న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ స్థూపానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లేందుకే పాలాభిషేకం కార్యక్రమాన్ని లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టినట్లు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ తెలియజేసారు.

## అమ్మవారు ప్రజలందరినీ చల్లంగా కాపాడాలి : ఎమ్మెల్యే దానం



శ్రీభూలక్ష్మి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**బేగంపేట జులై 29, ప్రభాతవార్త**

శ్రీభూలక్ష్మి అమ్మ వారు ప్రజలందరినీ చల్లంగా కాచి కాపాడాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం బేగంపేట ప్రకాశం నగర్ శ్రీభూలక్ష్మి దేవాలయంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. రంగం అనంతరం గావు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం కు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆలయ నిర్మాణ దాత విశాల్‌సూథం, ఈ ఓ విఠలయ్యల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అమ్మ వారికి పూజలు నిర్వహింపజేసారు. తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. అనంతరం దానం మాట్లాడుతూ ఆషాడ మాస బోనాలు అంటే అమ్మ వారికి ఎంతో ప్రీతి పాత్రమైనవని అన్నారు. భక్తులు ప్రేమతో తీసుకు వచ్చే బోనాలు, ఒడిబియ్యం, తదితరాలతో అమ్మ వారు ఎంతో సంతోషంగా ఉంటారన్నారు. భక్తులకు కంటికి రెప్పలా అమ్మ వారు కాపాడుకుంటారని నమ్మకాన్ని దానం వ్యక్తం చేసారు. ఆలయ నిర్మాణ దాత విశాల్ సూథం మాట్లాడుతూ మొట్ట మొదటి సారిగా ఆషాడ బోనాల లో భాగంగా అమ్మ వారి ఘటాన్ని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించామని, అమ్మ వారిని పెద్ద సంఖ్యలో దర్శించుకుని బోనాలు, ఒడిబియ్యం, సాక సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని, జాతర ప్రశాంతంగా ముగిసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ గౌస్, ఎల్లయ్య , కృష్ణ, తుకారాం, వెంకటేష్, అశోక్, సాయి. గోవిందరావు, సత్యనారాయణ, శేఖర్, నర్సింహ, లక్ష్మీనారాయణ, ధీరజ్. రఘునాద్ ఉన్నారు.

## చిలుకలగూడ మావురాల రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మెట్టుగూడ, జులై 29 ప్రభాతవార్త:**

ఎంతో మహిమకల్గిన స్వయంబుగా వెలసిన చిలుకలగూడ రైల్వేక్వార్టర్స్‌లో ఉన్న శ్రీశ్రీ మావురాల రేణుక ఎల్లమ్మ దేవాయాన్ని కేంద్ర మంత్రి కషన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ శోభ శ్రీబాబు, ప్రధాన కార్యదర్శి ఎ.ఆదర్శ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల వేడుకలకు మంత్రి కిషన్ రెడ్డి హాజరై అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కిషన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, గౌడ్, మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి, కంటెస్టెడ్‌ఎమ్మెల్యే మేకల సారంగపాణి, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, కనకట్ల హరి, జిల్లా అధికార ప్రతినిధి శారద మల్లేష్, వెంకటేష్ గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, కృష్ణ, మహేష్, భాస్కర్, గిరి, బిక్షపతి, రామువర్మ, రాజు జైన్, అంబాల రాజేశ్వర్, సంపత్, నరేష్ మాదిగ, సత్యనారాయణ, శ్రీనివాస్, మంజుల, సురేందర్, విజయ్‌కుమార్, నాగేందర్, రవీందర్, సింహాచలం బాబు, అనుష, సరోజతో పాటు పలువురు పాల్గొన్నారు.



మావురాల రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## నల్లకుంట బోనాల వేడుకల్లో కృష్ణ గౌడ్



నర్సింహాబస్తీలో అమ్మవారి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 29 ప్రభాతవార్త**

నల్లకుంట డివిజన్ నర్సింహాబస్తీలో ఏర్పాటు చేసిన బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ పాల్గొన్నారు. సోమవారం అమ్మవారి రంగం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు లక్ష్మన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇఎస్ ధనుంజయ, జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు మృతి**

**చార్మినార్, జూలై 29 ప్రభాతవార్త :**

పాతబస్తీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రె స్ నాయకులు బి.ఆర్.ఆంజనేయులు మృతి పట్ల తెలంగాణ కాంగ్రెస్ కమిటి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా అనా రోగ్యంతో బాధ పడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి.ఆర్.ఆంజనేయులు (70) సోమవారం మృతి చెందారు.

కాగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి.ఆర్. ఆంజనేయులు మరణం పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి తెలంగాణ కాంగ్రెస్ కమిటి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్‌తో పాటు పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యాలాల్, ఆర్. అశోక్‌రెడ్డి, పులిపాటి రాహుల్‌లు తమ సానుభూతిని వ్యక్తం చేశారు. బి.ఆర్.అంజనేయులకు భార్య ,ముగ్గురు కుమారులు, కమార్తె కలరు.

**IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM I ADDITIONAL METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : MALKAJGIRI O.S.No.760 OF 2024**

Between:
**Smt. Kancharla Supriya and others ...Plaintiffs**
And
**1]. The Tahasildar,** Kapra Mandal, Medchal-Malkajgiri District.
**2] All concerned ...Defendants**
To,
**All Concerned**

**NOTICE**

All the General public are here by informed that the above named plaintiffsfiled the above suit to declare them as the Legal heirs of Late.Sri. Kancharla Ramesh. The said suit stands posted to **20.08.2024 at 10.30 A.M.** for objections/Claims. If no objections are received on the said date before the Hon'blel Additional Junior Civil Judge cum I Additional Metropolitan Magistrate, Medchal-Malkajgiri District At: Malkajgiri, the matter will be disposed of in accordance with law.

(By order of the Hon'ble I Additional Junior Civil Judge cum I Additional Metropolitan Magistrate, Medchal-Malkajgiri District At: Malkajgiri)

**SANDHYA RANI TULA**
**Advocate**
**Mob: 7702217037**

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, R. R. DISTRICT, AT : HAYATH NAGAR O.S. No. 546 OF 2024**

Between:
**Sathiri Ramulamma and others ...Plaintiffs**
AND
**1. The Tahsildhar,** Abdullapurmet Mandal, R.R. District
**2. All Concerned ...Defendants**
To.
**All Concerned**

It is hereby take notice that the plaintiffs herein have filed the above suit in the above mentioned court for declaration of legal heirs and successors of deceased Sathiri Rudraiah who was died on 26-03-2024. The said matter is posted to **12-08-2024** for appearance of any objectionable persons. Therefore it hereby informed that if anybody having interest or claim on the legal heirs of said deceased person may appear in the above-mentioned court by 10:30 A.M., either in person or through an advocate on the above-mentioned date. If you failed to appear before the court, the Hon'ble Court would be decided the matter in your absence.

(BY ORDER OF THE COURT)

**Sd/- BANDI NARESH**
**ADVOCATE**
Office At: 4-2-86, Old Road, Hayathnagar, R.R. District.
**Cell: 9985771982**

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT: AT : HYDERABAD O.S.No. 3286 OF 2024**

BETWEEN:
**Gadadagunti Sharada and others ...Plaintiffs**
AND
**1) The Tahsildar,** Saidabad Mandal, and others
**...Defendants**
To
**All concern**

Please take notice that the Plaintiffs filed the above suit for Declaration of Legal Heirs to declare them as legal heirs and successors of Late Gaddagunti Uma Pathi. If any person or persons have any objections may approach the above mentioned court on **19-08-2024 at 10.30 A.M** either Personally or through an Advocate failing which the matter will be proceeds on Merits.

// By order of the Court //

**J. VEERA BRAHMACHARY**
**Advocate**
R/o. 2-3-512, Amberpet, Hyderabad

## లెనిన్‌నగర్ కట్ట మైసమ్మ, మీర్‌పేట్ పోచమ్మ ఆలయాల్లో సబితమ్మ పూజలు



లెనిన్‌నగర్ కట్టమైసమ్మ ఆలయాన్ని సందర్శించిన సబిత ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా మాజీ మంత్రి, శాసనసభ్యురాలు పి.సబిత ఇంద్రారెడ్డి లెనిన్‌నగర్ కట్ట మైసమ్మ, మీర్‌పేట్ ఓల్డ్ విలేజ్ నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల కమిటీల వారు ఆమెకు ఘన స్వాగతం పలికి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సబితారెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు కీసర హరినాథ్‌రెడ్డి, ఉద్యాల నవీన్‌గౌడ్, బొక్క రాజేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్‌తో పాటు మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, దీప్‌లాల్ చౌహాన్, దిండు భూపేష్‌గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, అర్కల కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం దృష్టికి ఉప్పల్ భగాయత్ సమస్యలు



ఉప్పల్ భగాయత్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

ఉప్పల్, జూలై 29 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్‌లో నెలకొన్న సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు భగాయత్ అసోసియేషన్ నేతలు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డిలను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా భగాయత్‌లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్ సమస్యలను విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ భగాయత్‌లో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పంక్షన్‌హాల్ ఏర్పాటు చేయాలని కోరారు. లేఅవుట్ నిబంధనలప్రకారం గతంలో చెప్పిన విధంగా వసతులు చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ భగాయత్ సమస్యలను సిఎం దృష్టికి తీసుకుని వెళతామని, ఎనిమిదిన్నర ఎకరాలలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంక్షన్‌హాల్ కూడా నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భగాయత్ అసోసియేషన్ నేతలు ఈగ సంతోష్, నిదానకవి సుదర్శన్, సోమ జంగయ్య, గొరిగె రాజేష్, సోమ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన బోనాల సంబరాలు : టికెఆర్



సామూహిక బోనాల ఊరేగింపులో పాల్గొన్న తీగల కృష్ణారెడ్డి

సరూర్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి స్వగ్రామం మీర్‌పేట్‌లో బోనాల జాతర మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో జరిగే బోనాలను ఈ సారి పాతబస్తీ హైదరాబాద్ మహంకాళి జాతర జరిగే రోజే గ్రామస్తులు జరుపుకోవడం విశేషం. పండుగ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి, టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ తీగల అమర్‌నాథ్‌రెడ్డి, తీగల నితీష్‌రెడ్డితో పాటు పాత గ్రామం ప్రజలు సామూహిక బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ దేవతలకు పూజలు చేశారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ : ఏసీపీ



సుబ్రహ్మణ్య కాలనీలో సీసీకెమెరాల ప్రారంభోత్సవంలో ఏసీపీ, కార్పొరేటర్

హయత్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త: ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ సుబ్రహ్మణ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చిన కాలనీ ప్రతినిధులు, సహకరించిన కార్పొరేటర్‌ను అభినందనలు తెలిపారు. అధునాతన టెక్నాలజీని వినియోగించి సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రణతోపాటు అసాంఘిక కార్యకలాపాలు, ప్రమాదాలు జరిగినపుడు సంఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**స్వాగత తోరణం, ఆలయ మండపం ప్రారంభం...** సుబ్రహ్మణ్యనగర్ కాలనీలో కాలనీ నూతన స్వాగత తోరణం, ఆలయ మండపాన్ని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాగత తోరణం, ఆలయ మండప నిర్మాణ దాతలు మేడిది లక్ష్మణరావు, అంకం కృష్ణయ్య, కుంచాల సుబ్బారావు దంపతులను ఆయన అభినందించారు. కాలనీ ప్రతినిధులు గోపాలరావు, అశ్వినీభాస్కర్, చెరుకు కృష్ణ, సత్యనారాయణ, రేవతి, రాములు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

ఉప్పల్, జూలై 29 ప్రభాతవార్త : ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ బస్టాండ్ బిటి కమాన్ వద్ద ఆటో డ్రైవర్లు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ప్రజలకు ఇబ్బందిలేకుండా వాహనాలను పార్కు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై వాహనాలు పెట్టి ఇబ్బంది కలిగించే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిఐలు మహిపాల్‌రెడ్డి, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు : క్యానం రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్, జూలై 29 ప్రభాతవార్త: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరకు కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంతోషకరమైన వాతావరణంలో బోనాల పండుగను నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాలనీ సలహాదారులు గౌరవ సలహాదారులు రంపె చంద్రమౌళి, సలహాదారులు ఇస్త్రారి, చెట్టప్ప, జగదీష్ చారి, వెంకన్న గౌడ్, అధ్యక్షులు బుగ్గ ఉపేందర్, ప్రధాన కార్యదర్శి గ్యారల రమేష్, ఉపాధ్యక్షులు వెంకటేష్ చారి, రొయ్యల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరకాలనీలో సిసి కెమెరాల ఏర్పాటు

ఉప్పల్, జూలై 29 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను స్థానిక కార్పొరేటర్ మందముల రజితరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీలో అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కాలనీ అసోసియేషన్ నేతలను తన వంతు సహకారం అందిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, శ్రీనివాస్, పాండు, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్‌రెడ్డి, సోమయ్య, కుమారస్వామి, శ్రీధర్, లగాన్, వినయ్‌భాస్కర్, రుద్ర మురళీ, శ్రీశైలం, రాజేష్, మధుసూధన్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## దేవి ప్రసన్నశర్మకు ధార్మిక సేవా శిఖర పురస్కారం

ఉప్పల్, జూలై 29 ప్రభాతవార్త : ఉప్పల్ అయ్యప్పసేవా సమితి వ్యవస్థాపకులు, శ్రీ రామచంద్రస్వామి దేవాలయం అనువంశిక వ్యవస్థాపక ధర్మకర్త, ప్రముఖ సంఖ్యా శాస్త్ర, వాస్తు నిపుణులు దైవజ్ఞ భూషణ్ దేవి ప్రసన్నశర్మకు మోహన పౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక సేవా శిఖర పురస్కారం లభించింది. ఈ మేరకు త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో మాజీ సిఎం నాదేండ్ల భాస్కర్‌రావు, సముద్రాల వేణుగోపాలచారి, దైవజ్ఞశర్మ, మోహన పౌండేషన్ అధ్యక్షుడు పిఎంకె గాంధీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా దేవిప్రసన్నశర్మ మాట్లాడుతూ ధార్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న తనకు పురస్కారం లభించడం ఎంతో అనందంగా ఉందన్నారు. ధార్మిక సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉప్పల్ నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు.

## లక్ష్మారెడ్డి కాలనీలో అధ్వాన్నంగా డ్రైనేజీ వ్యవస్థ



అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ఇంటిలోకి వస్తున్న మురుగునీరు

ఉప్పల్, జూలై 29 ప్రభాతవార్త : ఉప్పల్ లక్ష్మారెడ్డికాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. కాలనీలో విచ్చలవిడిగా వెలిసిన భవన అంతస్థులు, మరికొన్ని ఇళ్లలో నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ వ్యవస్థలు ఉండడంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ డివిజన్ లక్ష్మారెడ్డికాలనీలో గతంలో చిన్న చిన్న ఇళ్లు ఉండేవి. అభివృద్ధి చెందుతున్న క్రమంలో చిన్న చిన్న ఇళ్లను కూల్చివేసి బడా భవనాలు నిర్మించారు. వీటిలో హస్టల్స్, జిమ్‌లు, హోటల్స్‌కు అద్దెకు ఇచ్చారు. హస్టల్స్‌లో ఉండే ప్రజలు చెత్తాచెదారం డ్రైనేజీలో వేస్తుండడంతో తమకు నిత్యం మురుగునీటి సమస్య వస్తుందని, ఏడాది పొడవునా మురుగునీటితో కాలం వెల్లదీస్తున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. పురాతన కాలంలో వేసిన డ్రైనేజీ పైపులు చిన్నగా ఉండడం, పలుచోట్ల నిర్మాణాలు పెరిగి ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో సమస్య మరింత తీవ్రతరమైంది. దీనిపై జలమండలి, జిహెచ్‌ఎంసి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## సంధ్య మరణించడంలో తమ తప్పిదం లేదు : శివ నర్సింగ్ హోం వైద్యులు

నాచారం, జులై 29 ప్రభాతవార్త: మల్లాపూర్ సూర్యనగర్‌కు చెందిన సంధ్యకు తాము అనుభవజ్ఞులైన సీనియర్ సర్జన్‌తో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించామని నాచారం రాఘవేంద్రనగర్‌లోని శివనర్సింగ్ హోం వైద్యులు వివరణ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ ఆపరేషన్ చేసిన సీనియర్ సర్జన్ ఎన్నో వేల ఆపరేషన్లు చేసిన అనుభవం ఉన్న డాక్టర్ అన్నారు. సంధ్యకు గత నెల 26న తమ హాస్పిటల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకున్నారని ఆమెకు ఆరోగ్యం బాగా వుండటంతో తాము డిచ్చార్జ్ చేయడం జరిగిందన్నారు. ఆమెకు తాము ఆరోగ్యం విషయంలో పలు సూచనలు చేశామని చెప్పారు. ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తమను సంప్రదించాలని చెప్పడం జరిగిందన్నారు. వారం తరువాత ఆమె తమ హాస్పిటల్‌కు వచ్చిందని అప్పటికే ఆమె పేగుకు రంధ్రం ఉందని తాము ఉచితంగానే చికిత్స చేయిస్తామని వారికి హామినిచ్చినా వారు ఇతర హాస్పిటల్‌కు వెళ్లాడం జరిగిందన్నారు. ఏది ఏమైనా ఆమె మరణించడం తమకు ఎంతో బాధ కలిగిందన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ పవన్



పవన్ కుమార్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలనీవాసులు

ఎల్.బి.నగర్, జూలై 29 ప్రభాతవార్త : కాలనీ అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం పవన్‌కుమార్‌ను నూతన కార్యవర్గ సభ్యులు కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ పుష్పగుచ్ఛని అందజేశారు. అనంతరం కాలనీలో ఉన్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కాలనీ అధ్యక్షుడు జయప్రకాష్, సెక్రెటరీ రమణ, రవీందర్‌రావు, అంజిరెడ్డి, సుధాకర్, భానుప్రకాష్, శివరాజ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## మూడుగుళ్ళ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు

నేరెడ్‌మెట్, జూలై 29 ప్రభాతవార్త: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. సోమవారం వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని నేరెడ్‌మెట్ మూడు గుడుల దేవాలయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. మల్కాజిగిరి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, జిఎన్‌వి సతీష్, వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, పిట్టల నాగరాజు, సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు కావలి ఈశ్వర్ యాదవ్, పంజా శ్రీనివాస్, రవి, శ్రీశైలం, అలూరి శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**సప్తగిరి కాలనీలో..** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీల్లో బోనాల సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం తొట్టెలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ ప్రసాద్, చెన్నారెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, కేశప్ప, శ్రీధర్, శ్రీనివాస్, రామక్రిష్ణ, రాములు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరు పేదలకు వరం సిఎం సహాయ నిధి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ఎల్.బి.నగర్, జూలై 29 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. నాగోల్ లోని ఉప్పల శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ సాయి రామ్ కాలనీకి చెందిన హన్య రూ. 60వేల చెక్కును, మునుగోడు నియోజకవర్గానికి చెందిన లక్ష్మమ్మకు రూ.16వేల చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ మొదటి కర్తవ్యమని, నిరు పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి వుంటుందన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు మెరుగు పరిచి నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు.

## బ్రాహ్మణ అభ్యున్నతికి కృషి చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు: మునిపల్లి

ఎల్.బి.నగర్, జులై 29 ప్రభాతవార్త: బ్రాహ్మణుల సంక్షేమ కొరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్లో రూ.50 కోట్లు కేటాయించడం పట్ల తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ రావు ధన్యవాదములు తెలియజేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సమావేశం సోమవారం కొత్తపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా విదేశీ విద్య చదువుకుంటున్న బ్రాహ్మణ విద్యార్థుల పెండింగ్ స్కాలర్షిప్ లు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అదనంగా కనీసం రూ.200 కోట్లు కేటాయించి బ్రాహ్మణులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర మూర్తి, ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, బానగిరి నాగరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మలక్‌పేట పరిధిలో బోనాల ఉత్సవాలు



పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈటెల రాజేందర్, భాగ్యలక్ష్మి



పూజలు నిర్వహిస్తున్న జూకంటి యాదగిరి కాటపల్లి రాజేశ్వరరావు



బొక్క గోవర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న దేవాలయం నిర్వాహకుడు అమిత్



దర్బార్ మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చేకోలేకర్, కిషన్‌సింగ్



నల్ల పోచమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బంగారం మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న కమిటసభ్యులు

మలక్‌పేట, జూలై 29 ప్రభాతవార్త : బోనాల ఉత్సవాలు మలక్‌పేటలో ఘనంగా నిర్వహించారు. ముసారాంబాగ్ సాయినగర్‌కాలనీలోని శ్రీపోచమ్మ దేవాలయంలో ఎంపీ ఈటెల రాజేందర్, డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందడి సురేందర్ రెడ్డి. బొక్క మధుసూదన్ రెడ్డి. కొప్పుల దినేష్. నిర్వాహకులు బండి అనిల్ కుమార్. ముదిరాజ్ అమిత్ కుమార్. నందు పాల్గొన్నారు. శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో కమిటీ అధ్యక్షుడు జూకంటి యాదగిరి ప్రధాన కార్యదర్శి కాటేపల్లి రాజేశ్వరరావు, కోశాధికారి ఆకుల విష్ణువర్ధన్‌యాదవ్, కాసుల జంగయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు మాఊరి నరసింహ, శ్రీనివాస్‌యాదవ్, బద్దం జంగారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ నాయకుడు బొక్క గోవర్ధన్‌రెడ్డి. సాయి నగర్ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా నిర్వాహకులు బండి అమిత్ కుమార్ శాలువాతో ఆయనను సన్మానించారు. శ్రీపురంకాలనీ శ్రీనల్లపోచమ్మ దేవాలయంలో ఆలయ నిర్వాహకులు సబ్బి నరహరి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వడ్డెర బస్తీలోని శ్రీబంగారు మైసమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మయ్య ప్రధానకార్యదర్శి రామకృష్ణ, యాదయ్య, రాజు, నాగయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు. చాదర్ఘాట్ దర్బార్ మైసమ్మ దేవాలయంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషన్‌సింగ్, రాహుల్‌సింగ్ పాల్గొన్నారు.

## శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపు



ఎంపి డి.కె.అరుణకు జ్ఞాపికను బహుకరిస్తున్న కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి



విష్ణునగర్‌లో పోతరాజుల నృత్యాలు, వివిధ వేషధారణల్లో చిన్నారులు



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు

సైదాబాద్, జూలై 29 ప్రభాతవార్త: శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ మెయిన్ రోడ్డుపై సోమవారం ఘటాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. పోతరాజులు నృత్యాలు, పౌరాణిక, దేశభక్తుల వేషధారణల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యువత, చిన్నారులు భక్తి పాటలతో భజనలతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ చైర్మన్, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కమిటీ అధ్యక్షుడు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదారి రాంకుమార్, ఉపాధ్యక్షులు కూసూరు సహదేవ్ యాదవ్, సంగోధి పరమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చందర్జీ తదితరులు పాల్గొన్నారు.

**తొట్టెలు, ఫలహార బండ్ల ఊరేగింపు...** బోనాల ఉత్సవాల్లో భాగంగా సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తొట్టెలు, ఫలహార బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు డి.కె.అరుణ, కొండ విశ్వేశ్వర్‌రెడ్డిలు హాజరయ్యారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు.

**ఐఎస్ సదన్ విష్ణునగర్‌లో ఘనంగా బోనాలు...** ఐఎస్ సదన్ డివిజన్ విష్ణునగర్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విష్ణునగర్‌తో పాటు పరిసర కాలనీల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం తొట్టెల ఊరేగింపును భక్తజన సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త కదారి బిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల కృపతో ప్రజలు చల్లంగా ఉండాలి: మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్

సరూర్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త: గ్రామ దేవతల కృపతో ప్రజలు చల్లగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆయన మీర్‌పేట్, లెనిన్‌నగర్‌లలోని గ్రామ దేవతల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, పద్మశ్రీ, పద్మారెడ్డి, రేణుక, ఎరుకల రవిగౌడ్, స్వామి నాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో అసెంబ్లీని విజయవంతం చేయాలి

హయత్‌నగర్, జూలై 29 ప్రభాతవార్త: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 30న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హలో కార్మిక... చలోఅసెంబ్లీ పేరుతో నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర హరిసింగ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హయత్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, నాయకులు ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడుతూ... కార్మికుల సమస్యలు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు అందించాలని, చనిపోతే రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## నాచారంలో ఘనంగా బోనాల వేడుకలు



బోనాలను అమ్మవారికి సమర్పిస్తున్న పొదల అంజమ్మ, మహిళలు

నాచారం, జులై 29 ప్రభాతవార్త: నాచారం వీఎస్‌టీ కాలనీలోగల దేవుడు అంజమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నాచారం ప్రధాన రోడ్డులో ఉన్న ఎంతో మహిమకల్గిన మహంకాళి ఆలయంలో అమ్మవారికి పొదల అంజమ్మ పలువురి మహిళలతో కలిసి బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లా బోనం సమర్పించారు. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతూ ప్రతి ఏటా తాము బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అమ్మకు బోనం సమర్పిస్తే అన్ని శుభాలే జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రజక సెల్ స్టేట్ కన్వీనర్ కొన్నె సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మామిడాల సంతోష్ రెడ్డి, స్రవంతి, సత్యవతి, రేణుక, నిఖిత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.